సాక్షి
కుమురం భీం

గురువారం । 29 । ఆగస్టు । 2024



క్రీడా కెరటాలు..!

క్రీడాపాఠశాలల విద్యార్థులు వివిధ క్రీడా వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కథనం.

8లో▸

పోలీసు స్టేషన్లు తనిఖీ

కాగజ్‌నగర్‌రూరల్‌: కాగజ్‌నగర్‌ రూరల్‌, ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లతోపాటు కాగజ్‌నగర్‌రూరల్‌ సర్కిల్‌ కార్యాలయాన్ని బుధవారం ఎస్పీ శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్‌, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్‌, సీఐ శ్రీనివాస్‌, ఎస్సైలు మహేందర్‌, రామన్‌ కుమార్‌ తదితరులు ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2 /25.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి



పాఠశాలలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

కాగజ్‌నగర్‌రూరల్‌: విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యసేవలు అందించాలని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్‌ వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంనాయక్‌, వైద్యులు ఉన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



మాట్లాడుతున్న డీఐఈవో కళ్యాణి

వాంకిడి(ఆసిఫాబాద్‌): విద్యార్థుల హాజరు శాతం పెంచడంపై జూనియర్‌ కళాశాలల సిబ్బంది దృష్టి సారించాలని డీఐఈవో సీహెచ్‌ కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా తరగతులు నిర్వహించి విద్యాప్రమాణాలు పెంచాలన్నారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ రాందాస్‌, అధ్యాపకులు చంద్రయ్య, సురేందర్‌ కుమార్‌, సంతోష్‌, రాజమౌళి, శ్రీధర్‌, కిరణ్‌కుమార్‌, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఆసిఫాబాద్‌అర్బన్‌: వినాయక చవితి సందర్భంగా జిల్లాలో గణేశ్‌ మండపాల ఏర్పాటుకు పోలీసుశాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. శాంతియుతంగా నవరాత్రోత్సవాలు నిర్వహించుకోవాలని, సాంస్కృతిక కార్యక్రమాల ముసుగులో అసభ్యకరమైన, అనైతిక ప్రదర్శనలు, రికార్డింగ్‌ డ్యాన్సులు నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ గణేశ్‌ మండలి నిర్వాహకులు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్థలాల్లో ఏర్పాటు చేస్తే స్థానిక పంచాయతీ నుంచి, వ్యక్తిగత స్థలమైతే యజమాని నుంచి అనుమతి పొందాలన్నారు. విగ్రహాల ఎత్తు ఐదు అడుగులు మించొద్దన్నారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించొద్దన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్‌ కనెక్షన్‌ కోసం విద్యుత్‌శాఖ నుంచి అనుమతి పొందాలని సూచించారు. అలాగే ఊరేగింపు, నిమజ్జనం తేదీపై పోలీసులకు ముందుగానే సమాచారం అందించాలన్నారు. వాహన డ్రైవర్‌ వివరాలు, ఆధార్‌ కార్డు జిరాక్స్‌ సమర్పించాలని సూచించారు. పండుగ శాంతియుతంగా జరుపుకొనేందుకు భక్తులు, నిర్వాహకులు సహకరించాలని కోరారు.

ఎఫ్‌ఎల్‌ఎన్‌ శిక్షణకు జిల్లా నోడల్‌ అధికారులు



శిక్షణ కేంద్రం వద్ద అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఎఫ్‌ఎల్‌ఎన్‌, ఎల్‌ఐపీ కార్యక్రమాలపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణలో జిల్లాకు చెందిన 15 మంది నోడల్‌ అధికారులు పాల్గొన్నారు. జిల్లా అకాడమిక్‌ మానిటరింగ్‌ అధికారి శ్రీనివాస్‌ మాట్లాడుతూ నోడల్‌ అధికారులు పాఠశాలలను సందర్శించినప్పుడు తెలంగాణ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలి.. అకాడమీ గైడెన్స్‌ రిజిస్టర్‌ ఏవిధంగా రాయాలి, ఉపాధ్యాయుల పనితీరును ఎలా మానిటరింగ్‌ చేయాలి, నవంబర్‌ 19 నుంచి నిర్వహించే నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వేకు విద్యార్థులను ఎలా సంసిద్ధం చేయాలనే అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు.

బేరసారాలు!?

- 'అద్దె పెంచండి.. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ప్రాంగణం అప్పగిస్తాం..'
- కలెక్టర్‌కు డా.రాజేంద్రప్రసాద్‌ బీఎడ్‌ కాలేజీ యాజమాన్యం ప్రతిపాదన
- చదరపు అడుగుకు రూ.18 చొప్పున డిమాండ్‌
- 41,280 చదరపు అడుగులకు నెలకు రూ.7.43 లక్షల అద్దె
- ఆసిఫాబాద్‌ పట్టణానికి బీఎడ్‌ కళాశాలను తరలించే యోచన



డాక్టర్‌ రాజేంద్రప్రసాద్‌ బీఎడ్‌ కళాశాల భవనం

సాక్షి, ఆసిఫాబాద్‌: ఆయన 'కాదంటే.. అవునని' అర్థం. గత ఐదేళ్లు తన బీఎడ్‌ కాలేజీ ప్రాంగణంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల(గిరిజన)ను ఏటా అక్కడి నుంచి తొలగించాలని ఆయన కోరుతారు. అధికారులకు లేఖలూ రాస్తారు. ఆ కళాశాలతో కాకతీయ యూనివర్సిటీ నుంచి బీఎడ్‌ అఫ్లియేషన్‌కు ఇబ్బందులు తలెత్తుతాయని చెబుతారు. తీరా యూనివర్సిటీ అధికారులు అఫ్లియేషన్‌ ప్రక్రియ ముగించగానే.. ఇక గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ఊసే ఎత్తరు. యథావిధిగా నెలనెలా అద్దె తీసుకుంటూ మళ్లీ ఏడాది గడిపేస్తారు... ఇది గత ఐదేళ్లుగా ఇటు అధికారులకు.. బీఎడ్‌ కళాశాల యాజమాన్యం మధ్య జరుగుతున్న తంతు. తాజాగా 'అద్దె పెంచి ఇస్తే.. తన ప్రాంగణం మొత్తం గిరిజన మహిళా డిగ్రీ కళాశాలకు ఇచ్చేస్తాం' అని మంగళవారం బీఎడ్‌ కళాశాల యజమాని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదన చేయడం గమనార్హం.

ఆసిఫాబాద్‌ మండలం బూర్గుడ గ్రామ పరిధిలో మదర్‌ థెరిస్సా ఎడ్యుకేషన్‌ సొసైటీ ఆధ్వర్యంలో 2003లో డాక్టర్‌ రాజేంద్రప్రసాద్‌ బీఎడ్‌ కళాశాలను తాటిపల్లి ప్రసాద్‌ ప్రారంభించారు. తర్వాత 2007లో ఇదే కళాశాల ప్రాంగణంలో డైట్‌(టీటీసీ) కాలేజీని ఏర్పాటు చేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ సొసైటీ ఆధ్వర్యంలో 2017– 18లో 22 గిరిజన మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో ఆసిఫాబాద్‌ జిల్లాకు ఒకటి మంజూరైంది. ఈ కళాశాలనే డా.రాజేంద్రప్రసాద్‌ బీఎడ్‌ కళాశాలలోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌ పట్టణంలో కళాశాల నిర్వహణ కోసం సరైన భవనం లేకపోవడంతో అప్పటి కలెక్టర్‌, ఐటీడీవో పీవో తదితరులు కోరగా.. బీఎడ్‌ కళాశాల యజమాని ఇక్కడ అద్దె ప్రతిపాదికన కళాశాల నిర్వహించడానికి ఒప్పందం చేసుకున్నారు.

తొలుత చదరపు అడుగుకు రూ.11 చొప్పున అద్దె..

మదర్‌ థెరిస్సా ఎడ్యుకేషన్‌ సొసైటీ ఆధ్వర్యంలో జీ+2 పద్ధతిన 41,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో కళాశాల భవనాన్ని నిర్మించారు. ఇందులో గిరిజన మహిళా డిగ్రీ కళాశాల కోసం మొదటి అంతస్తులోని 24,525 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కేటాయించారు. అందుకు చదరపు అడుగుకు రూ.11 చొప్పున నెలకు రూ.2.69 లక్షలు అద్దెరూపంలో ప్రభుత్వం చెల్లించింది. 2022 వరకు ఇలాగే కొనసాగింది. 2022లో కాలేజీ అదనపు గదుల కోసం 5075.28 చదరపు అడుగుల విస్తీర్ణ స్థలాన్ని రెండో అంతస్తులో కేటాయించగా ఇందుకు చదరపు అడుగుకు రూ.12.10 చొప్పున అద్దెను కేటాయిస్తూ కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో రెండేళ్లకు 5 శాతం చొప్పున నాలుగేళ్లకు 10 శాతంగా అద్దెను పెంచి మొత్తం విస్తీర్ణానికి చదరపు అడుగుకు రూ.12.10 చొప్పున కేటాయించారు. 2022 నుంచి 29,600.28 చదరపు అడుగులకు ప్రతినెలా అద్దె కోసం రూ.3,58,163 లక్షలు చెల్లిస్తున్నారు. ఇప్పటివరకూ అద్దె రూపంలో కళాశాల యజమానికి రూ.2.62 కోట్లకుపైగా సొమ్ము చెల్లించారు.

అద్దె పెంచాలని ప్రతిపాదించా..

బీఎడ్‌ కళాశాల ప్రాంగణంలోనే ప్రభుత్వ మహిళా డిగ్రీ(గిరిజన) కాలేజీని నిర్వహిస్తుండటంతో ఏటా యూనివర్సిటీ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందువల్లే ప్రాంగణం మొత్తాన్ని గిరిజన డిగ్రీ కళాశాలకే కేటాయించాలని అనుకుంటున్నాం. అయితే ఇప్పుడు చదరపు అడుగుకు రూ.12.10 చొప్పున ఇస్తున్న అద్దెను రూ.18కి పెంచాలని కలెక్టర్‌కు ప్రతిపాదించాను. కలెక్టర్‌ కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు.

– తాటిపల్లి ప్రసాద్‌, కరస్పాండెంట్‌, డా.రాజేంద్రప్రసాద్‌ బీఎడ్‌ కళాశాల

రెట్టింపు అద్దె కోసం..

బీఎడ్‌, డీఎడ్‌ కాలేజీల నిర్వహణ లాభాసాటిగా లేకపోవడం.. ఏటా కాకతీయ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం బీఎడ్‌ కాలేజీ ప్రాంగణంలో మరో కళాశాల ఉండొద్దని పేర్కొనడం.. ఈ ఏడాది మహిళా డిగ్రీ, డీఎడ్‌ కళాశాలలు ఉన్నాయనే కారణంతో ఏకంగా ఎడ్‌సెట్‌ కౌన్సెలింగ్‌లో కళాశాల పేరును తొలగించడంతో మదర్‌ థెరిస్సా ఎడ్యుకేషనల్‌ సొసైటీ యాజమాన్యం ఆలోచనలో పడింది. అదేసమయంలో ఆసిఫాబాద్‌ పట్టణంలో వారి భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర పాఠశాలను సొంత భవనంలోకి తరలించడంతో ఆ భవనం ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఇప్పుడు బీఎడ్‌, డీఎడ్‌ కళాశాలలను ఆసిఫాబాద్‌ పట్టణానికి తరలించాలనే యోచన చేస్తున్నట్లు సమాచారం. మహిళా డిగ్రీ కళాశాలకే ప్రస్తుత ప్రాంగణాన్ని మొత్తం ఇచ్చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మంగళవారం కళాశాల యజమాని ప్రసాద్‌ కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రేను కలిసి బీఎడ్‌ కళాశాల ప్రాంగణాన్ని గిరిజన మహిళా కళాశాలకు ఇచ్చేస్తానని.. అయితే చదరపు అడుగుకు రూ.18 చొప్పున అద్దె చెల్లించాలనే ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నెలకు రూ.3.58 లక్షలు చొప్పున అద్దె తీసుకుంటుండగా. మొత్తం కళాశాల విస్తీర్ణం 41,280 చదరపు అడుగులకు రూ.18 చొప్పున అద్దె అంటే నెలకు రూ.7.43 లక్షలు అవుతుంది. అంటే రెట్టింపు స్థాయి కంటే ఎక్కువ అద్దె వస్తుంది. పెద్దఎత్తున అద్దె రూపంలో డబ్బు వస్తుండటంతో బీఎడ్‌ కళాశాల ఎక్కడ ఉన్నా పర్లేదు అన్న ధోరణిలో యాజమాన్యం ఉందని కళాశాల సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



ఫ్లోరింగ్‌ పరిశీలిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను బుధవారం డీఎంహెచ్‌వో తుకారాం, డీసీహెచ్‌ చెన్నకేశవులుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం నియమిస్తుందన్నారు. వసతి గృహంలో విద్యార్థినులకు సరిపడా సౌకర్యాలు ఉండాలన్నారు. గదులు, మూత్రశాలలు, ప్రయోగశాలలు ఇతర నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అన్ని అంతస్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్మాణ పనులను నిత్యం పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌ సతీశ్‌కు సూచించారు. విద్యార్థినుల సంరక్షణలో భాగంగా అనుమతి లేని వారు లోపలికి రాకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, కళాశాల సిబ్బంది ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలి



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సర్వ శిక్ష ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని శివాజీభవన్‌ నుంచి కలెక్టరేట్‌ వరకు బోనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపట్టారు. వీరి ధర్నాకు సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు, టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌ మద్దతు పలికారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్‌ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ రెగ్యులర్‌ చేసే వరకు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, హెల్త్‌ కార్డులు ఇవ్వాలని, నూతన నియామకాల్లో 30 శాతం వెయిటేజీ, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌, మరణించిన వారికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ సంఘం గౌరవ అధ్యక్షుడు మోహన్‌, ప్రధాన కార్యదర్శి తుకారాం, నాయకులు నగేశ్‌, సంతోష్‌, అనూప్‌కుమార్‌, సీఆర్పీలు దేవేందర్‌, మహేశ్వర్‌, సత్యనారాయణ, రాజేశ్‌, రాము, సందీప్‌, సుభాష్‌, పీటీఐలు రమేశ్‌, దేవన్న, రాజేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ వీవోఏలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐకేపీ వీవోఏలకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ డిమాండ్‌ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీవోఏలు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌ చౌక్‌ నుంచి కలెక్టరేట్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వీవోఏలను సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జీవో నం.58 సవరించాలని, మూడు నెలల రెన్యువల్‌ పద్ధతి రద్దు చేసి, ప్రతినెలా వ్యక్తిగత ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని డిమాండ్‌ చేశారు. అర్హులైన వారిని సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. అనంతరం డీపీఎం యశోదకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, వీవోఏల యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు రమ, కార్యదర్శి జ్యోతి, నాయకులు ఆనంద్‌, ఫయిమా, బుద్దు, స్వప్న, జయంత్‌, నితీష్‌, సంతోష్‌, సుజాత, తిరుపతి, రోజా, వనిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని విద్యాసంస్థలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఈవో అశోక్‌తో కలిసి అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యనందిస్తూ విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వ, ప్రైవేట్‌ విద్యాసంస్థలు కృషి చేయాలన్నారు. 2024– 25 విద్యాసంవత్సరంలో జిల్లాను మెరుగైన స్థానంలో నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి అందించాలని ఆదేశించారు. స్కూల్‌ డిజాస్టర్‌ మేనేజ్మెంట్‌ ప్రణాళికల్లో భాగంగా భవన నాణ్యత వివరాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఫొటోలు వివరాలతో కూడిన ఫ్లెక్సీలు ప్రదర్శించాలన్నారు.

వేతనాల్లో కోత విధించొద్దు



నిరసన తెలుపుతున్న నర్సింగ్‌ సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న నర్సింగ్‌ సిబ్బంది వేతనాల్లో కోత విధించొద్దని బుధవారం ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఏడాదికి 35 సెలవులు వినియోగించుకునే అవకాశం ఉన్నా.. జిల్లా కేంద్రంలో సిబ్బందికి లీవ్‌లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వర్తించిన తర్వాత మెడికల్‌ కళాశాలలో డ్యూటీలు వేస్తున్నారని తెలిపారు. నైట్‌ డ్యూటీల సమయంలో సెక్యూరిటీ పెంచి, పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. బయోమెట్రిక్‌ చెడిపోతే మాన్యువల్‌గా సంతకాలు తీసుకోవాలన్నారు. నర్సింగ్‌ ఉద్యోగులకు పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని, సమస్యల పరిష్కారం కోసం యూనియన్‌ ఏర్పాటు చేసుకోనే అవకాశం కల్పించాలన్నారు. మంగళవారం అర్ధరాత్రి స్టాఫ్‌నర్సు రమాదేవి మృతి చెందగా.. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నర్సింగ్‌ సిబ్బంది శ్రీలక్ష్మి, శ్రీదేవి, ఆసియా, జీవిత, పర్వీన్‌, సౌజన్య, నత్రీన్‌, శైలజ, సఫియా బేగం, స్వర్ణలత, నాగరాజు, ఫసీయోద్దీన్‌, జానకిరాం పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్‌ శివకృష్ణ

బెల్లంపల్లి: భూసారాన్ని పెంపొందించుకునేందుకు రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ కోట శివకృష్ణ అన్నారు. బుధవారం కేవీకే ప్రాంగణంలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాల రైతులకు పంట వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానం, తేనెటీగల పెంపకంలో చేపట్టాల్సిన మెలకువలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులు విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వాడుతున్నారని అన్నారు. భూమి సారాన్ని కోల్పోయి నిస్సత్తువుగా తయారవుతుందని, తద్వారా పంట దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉంటాయని తెలిపారు. భూసారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. వానపాముల ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసుకోవాలని సూచించారు. వందరోజుల వికసిత్‌ భారత్‌ ప్రణాళికలో భాగంగా ఈ నెల 31వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, స్రవంతి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

అక్షరానికి దూరం.. ఆటలతో కాలక్షేపం

కౌటాల మండలం శివలింగాపూర్‌ గిరిజన ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ ఇటీవల బదిలీపై మొగడ్‌దగడ్‌ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. వారం రోజులుగా ప్రాథమిక పాఠశాల తెరుచుకోవడం లేదు. విద్యార్థులు బడికి వచ్చి ఆడుకుని తిరిగి వెళ్లిపోతున్నారు.





కౌటాల మండలం గురుడుపేటలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవల బదిలీల్లో భాగంగా సింగిల్‌ టీచర్‌ను నియమించగా.. ఆయన అనారోగ్యంతో మెడికల్‌ లీవ్‌పై వెళ్లారు. వారం రోజులుగా పాఠశాల తెరుచుకోవడం లేదు. చిన్నారులు ప్రతిరోజూ పాఠశాల ప్రాంగణంలో ఆడుకుని ఇళ్లకు వెళ్తున్నారు.

- టీచర్లు బదిలీపై వెళ్లడంతో తెరుచుకోని గిరిజన ప్రాథమిక పాఠశాలలు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కౌటాల(సిర్పూర్‌): అధికారుల అలసత్వంతో ఆదివాసీ చిన్నారులు అక్షరాలకు దూరమవుతున్నారు. బదిలీల్లో భాగంగా ఏకోపాధ్యాయ పాఠశాలల నుంచి టీచర్లు వేరే పాఠశాలలు వెళ్లిపోయారు. ప్రస్తుతం అక్కడ ఉపాధ్యాయులు లేక బడులు తెరుచుకోవడం లేదు. బుధవారం 'సాక్షి' పలు గిరిజన పాఠశాలలను పరిశీలించగా చిన్నారులు పాఠశాల ఎదుట ఆటలతో కాలక్షేపం చేస్తూ కనిపించారు.


తెరుచుకోని పాఠశాలలు

గిరిజన గ్రామాల్లో కనీసం పది మంది విద్యార్థులున్నా అక్కడ గిరిజన ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమశాఖ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కానీ మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయులు పనిచేయడానికి ఇష్టపడకపోవడం, బదిలీ అయిన స్థానంలో మరొకరు రాకపోవడంతో, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణాలతో గిరిజన ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తున్నారు. కౌటాల మండలం మొగడ్‌దగడ్‌ కాంప్లెక్స్‌ పరిధిలో మొత్తం ఐదు గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లోని సింగిల్‌ టీచర్లు ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో మొగడ్‌దగడ్‌, జనగాం, కనికి, శివలింగపూర్‌లోని గిరిజన ప్రాథమిక పాఠశాలలు తెరుచుకోవడం లేదు. ఇక గురుడుపేట పాఠశాలల ఉపాధ్యాయుడు మెడికల్‌ లీవ్‌పై వెళ్లడంతో తాళం వేసి ఉంచుతున్నారు.

ఆటలతోనే కాలక్షేపం..

గిరిజన పాఠశాలలు తెరుచుకోకపోవడంతో నిత్యం విద్యార్థులు బడి వరకు వచ్చి నిరాశగా వెనుదిరుగుతున్నారు. కొంతమంది అక్కడే ఆటపాటలతో రోజంతా కాలక్షేపం చేస్తున్నారు. బడుల మూతతో మధ్యాహ్న భోజనం, చదువులకు కూడా దూరమవుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. టీచర్లను నియమించాలని కోరుతున్నారు.


ఆడుకుంటున్నాం



మా పాఠశాలలో 25 మంది చదువుకుంటున్నాం. ఇటీవల మా మేడం వేరే చోటుకు వెళ్లారు. గత వారం రోజులుగా బడి బంద్‌ ఉంది. మాకు చదువు చెప్పేవారు లేకుండా పోయారు. ఏం చేయాలో తెలియక కొంతసేపు ఆడుకుని ఇంటికి వెళ్తున్నాం.

– నితీశ్‌, విద్యార్థి, మొగడ్‌దగడ్‌

టీచర్లను నియమించాలి



ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రాథమిక విద్య అందకపోవడం బాధాకరం. మెరుగైన విద్య అందక గిరిజనులు ఉద్యోగాలు సాధించడం లేదు. ఉపాధ్యాయుడు రాక వారం రోజులుగా మా కొడుకు బడికి పోవడం లేదు. గిరిజన పాఠశాలల్లో వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి.

– సంతోష్‌, విద్యార్థి తండ్రి, శివలింగాపూర్‌

రేపు జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్‌: కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్‌ స్కూల్‌లో ఈ నెల 30న జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు తమ పాఠశాల నుంచి బోనఫైడ్‌ సర్టిఫికెట్‌ తీసుకురావాలని సూచించారు. అండర్‌ 14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

కుంటలో పడి మహిళ మృతి

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి గ్రామానికి చెందిన బంటు రుకుంబాయి (50) బుధవారం కూలీ పనికి వెళ్తూ కుంటలో పడి చనిపోయింది. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రుకుంబాయి స్థానికంగా వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. బుధవారం కూలీ పనికి వెళ్తుండగా కస్తూరిబా విద్యాలయం సమీపంలోని ఉల్లాజీ వ్యవసాయ కుంట దాటుతుండగా ఫిట్స్ రావడంతో అందులో పడిపోయింది. నీటమునిగి చనిపోయింది. మృతురాలి భర్త బంటు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దొంగతనం కేసులో జైలు

రామకృష్ణాపూర్: దొంగతనానికి పాల్పడ్డ నదీమ్ అన్సారీ అనే వ్యక్తికి తొమ్మిది నెలల జైలుశిక్ష విధిస్తూ మంచిర్యాల ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ సంపత్ బుధవారం తీర్పునిచ్చారని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత మే నెలలో క్యాతనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గల రాయలింగు ఇంట్లో చోరీకి పాల్పడి బంగారం, వెండి అపహరించిన కేసులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి తొమ్మిది నెలల జైలుశిక్ష విధించారని పేర్కొన్నారు.

ఆటోలో నుంచి పడి ఒకరు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ శివారులో బుధవారం ఆటోలో నుంచి పడి ఒకరు మృతి చెందారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన పులి మూర్తి(38) కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వేములవాడకు వెళ్లి తిరుగు పయనమయ్యారు. దొనబండ శివారులో బంధువు, డ్రైవర్ సురేశ్ వేగంగా వెళ్తున్న ఆటోను ఒక్కసారిగా ఎడమవైపుకు తిప్పడంతో వెనక కూర్చున్న మూర్తి అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలప స్వాధీనం



కలప స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కోటపల్లి: ప్రాణహిత నది ద్వారా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జనగామ గ్రామ సమీపంలో అక్రమంగా కలప తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు అధికారులు బుధవారం గస్తీ నిర్వహించారు. మధ్యాహ్నం కలప దుంగలను ప్రాణహిత నదిపై తెప్పలుగా తరలిస్తుండగా పట్టుకున్నారు. అనంతరం ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్వో సదానందంలు దుంగలను పరిశీలించారు. 29 టేకు దుంగలు లభ్యం కాగా వాటి విలువ రూ.2లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. డిప్యూటీ రేంజర్ పాషా, బీట్ ఆఫీసర్ రాజేందర్ ఉన్నారు.

బార్‌లో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో గాల సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. బార్ షట్టర్‌ను పగలగొట్టి దొంగలు బార్‌లోనికి ప్రవేశించారు. మొదటగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, కౌంటర్‌లో ఉన్న రూ.30వేల నగదు, రూ.5 వేల విలువ గల 7 మద్యం బాటిళ్లను అపహరించారు.

క్రీడా కెరటాలు..!

- సత్తా చాటుతున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాల

ఆదిలాబాద్: ప్రస్తుతం చదువులకు ఉన్న ప్రాధాన్యత క్రీడలకు దక్కడం లేదు. దీంతో సామర్థ్యం ఉన్నా విద్యార్థులు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని, ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడాపాఠశాలలను నిర్మించింది. సత్తా ఉన్న విద్యార్థులకు విద్య బోధన చేస్తూనే క్రీడల్లో వారిని మెరికల్లా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసింది. కాగా ఈ పాఠశాలల్లోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి వివిధ క్రీడా వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. పలు క్రీడాంశాల్లో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ భారత క్రీడా ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భవిష్యత్తు క్రీడాకారుల గురించి 'సాక్షి' కథనం..

జూడోలో అలేఖ్య సత్తా



క్రీడా పాఠశాలకు చెందిన కొంపెల్లి అలేఖ్య ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. జూడోలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. వరంగల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీల్లో -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకంతో మెరిసింది. కేరళలోని త్రిసూర్‌లో నవంబర్‌లో గత సంవత్సరం జరిగిన సౌత్ జోన్ ఎస్జీఎఫ్ఐ పోటీల్లో గోల్డ్‌మెడల్ పొందింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా -గోవా కేంద్రంలో ప్రత్యేక శిక్షణకు ఎంపికైంది. ప్రస్తుతం గోవాలో శిక్షణ తీసుకుంటుంది.

రేస్‌వాక్‌లో మెరిక



క్రీడా పాఠశాలకు చెందిన స్ఫూర్తి అథ్లెటిక్స్‌లో భాగమైన రేస్ వాక్ ఈవెంట్‌లో సత్తా చాటుతోంది. రేస్ వాక్ ఈవెంట్‌లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ -2023 పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ప్రాతినిధ్యం వహించి శభాష్ అనిపించుకుంది.

బాక్సింగ్ ఆశా కిరణం షోయబ్



క్రీడా పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న షోయబ్ మాలిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చుతున్నాడు. ఈ ఏడాది హైదరాబాద్‌లోని లాలాగూడలోని రైల్వే స్టేడియంలో జరిగిన తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో 52 -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్‌తో మెరిశాడు. నోయిడాలో జరిగిన మూడవ సబ్ జూనియర్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదగడమే లక్ష్యమని షోయబ్ పేర్కొంటున్నాడు.

పతకాల ఆనంది



పదవ తరగతి చదువుతున్న ఆనంది 400 మీటర్ల పరుగుల పోటీల్లో విజేతగా నిలుస్తోంది. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. 2023లోనే హన్మకొండలో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో రజక పతకంతో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో ప్రాతినిధ్యం వహించింది. ఇటీవల సరూర్‌నగర్ స్టేడియంలో మూడవ జాతీయ జావెలిన్ దినోత్సవం పురస్కరించుకొని జరిగిన పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది.

పరుగుల యువ'రాజ్'



క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యువరాజ్ 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 100 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచాడు. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.

కళాశాలల ప్రిన్సిపాళ్ల కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం ఎన్నికలు బుధవారం జరిగాయి. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా శంకర్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాసిపేట్), ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, జీజేసీ (బాయ్స్) బెల్లంపల్లి, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్‌రావు (లక్షెట్టిపేట్), మహిళ కార్యదర్శులుగా స్వరూప (బెల్లంపల్లి, గరల్స్ కళాశాల) ఎన్నికయ్యారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



గుగ్గె కిరణ్ (ఫైల్)

జైనూర్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జైనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన గుగ్గె కిరణ్(26) గత ఐదేళ్ల నుంచి వ్యాపారం కోసం కెరమెరిలో నివాసముంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కారణంగా అప్పుల పాలవడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 21న బైక్ ఫైనాన్స్ డబ్బులు కట్టడానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రం 4 గంటల సమయంలో భార్య శీతల్‌కు ఫోన్ చేసి పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కాగా అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. శీతల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీవోడబ్ల్యూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: హైదరాబాద్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో జరుగనున్న ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ఏడవ మహాసభల వాల్ పోస్టర్లను బుధవారం శ్రీరాంపూర్‌లోని సింగరేణి సివిల్ కార్యాలయం మైదానం వద్ద సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అరాచకాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారంపై మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. నాయకురాళ్లు శిరీష, శారద, కవిత, లక్ష్మి, మల్లేశ్వరి, కమలమ్మ, విజయ, స్వప్న పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఏరియా పరిధిలో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. బుధవారం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా గనులపై అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలు అందక ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని, తమ వేతనాల నుంచి సీఎంపీఎఫ్ కట్ చేసేందుకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. సెప్టెంబర్ 11లోగా యాజమాన్యం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

పత్తి చేనులో గంజాయి సాగు



గంజాయి మొక్కలు పరిశీలిస్తున్న ఎస్సై

కెరమెరి: మండలంలోని దే వుడ్‌పల్లి గ్రామానికి చెందిన తాక్సాండే పోచిరాం పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామని ఎస్సై గంపుల విజయ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం పోచి రాం చేనులో పరిశీలించగా 30 గంజాయి మొక్కలను గుర్తించామన్నారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిధులొచ్చాయ్..!

- వృత్తివిద్య కోర్సుల కోసం విడుదల
- ఉమ్మడి జిల్లాలోని 29 పాఠశాలల్లో కోర్సులు అమలు



వృత్తివిద్య కోర్సులపై అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు

మంచిర్యాలఅర్బన్: జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన బడుల్లో నూతన హంగులు సమకూర్చాలనే ఉద్దేశంతో పీఎంశ్రీ అమల్లోకి తెచ్చింది. పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి కల్పనకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వృత్తివిద్య కోర్సుల అమలుకు చర్యలు చేపట్టింది. ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి విద్యాభ్యాసం పూర్తి కాగానే ఉద్యోగవకాశాలు పొందేలా తోడ్పాటునందించనున్నారు.

29 పాఠశాలల్లో..

రాష్ట్రంలోని 88 కేజీబీవీలు, 14 గురుకుల విద్యాలయాల్లో 2023 -24 విద్యా సంవత్సరంలో వృత్తివిద్య కోర్సులు ప్రారంభమయ్యాయి. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 29 పాఠశాలల్లో వృత్తివిద్య కోర్సులకుగాను నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు బోధిస్తుండగా సామగ్రి, విద్యార్థుల బోధనకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఎన్ఎస్‌డీసీ సహకారంతో..

జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) సహకారంతో వృత్తివిద్య కోర్సులను ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. వృత్తివిద్య కోర్సుల నిర్వహణ వొకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్(వీటీపీ)కు అప్పగించారు. ఆయా సంస్థల నిపుణులైన శిక్షకులను నియమించి తరగతులు ప్రారంభించారు. పదోతరగతి వరకు ఉన్న పాఠశాలల్లో రెండు దశల్లో కోర్సులు అమలు చేస్తున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవల్ -1 పేరిట విలువైన సమయాన్ని వృథా చేయకుండా వృత్తివిద్య కోర్సులు బోధిస్తున్నారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. మిగితా రెండు దశలను ఇంటర్మీడియెట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేయనున్నారు. విద్యార్థులు సులభంగా నేర్చుకునేలా వ్యవసాయం, బ్యూటీపార్లర్, దుస్తులు మేడ్ అప్‌లు, గృహోపకరణాల అలంకరణ, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ టెక్నాలజీ, ప్లంబర్, క్రీడలు, ఫిజికల్ ఎడ్యుకేషనల్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. కోర్సులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు, పాఠశాల విద్యార్థులకు అవసరమైన జిరాక్స్‌లు తీసుకునేందుకు నిధులు మంజూరయ్యాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిధుల వివరాలు

జిల్లా	పాఠశాలల సంఖ్య	సామగ్రి కొనుగోలు	జిరాక్స్ (వర్క్‌బుక్స్, హ్యాండ్‌బుక్స్)
ఆదిలాబాద్	06	రూ.2,35,000	రూ.45,000
కుమురంభీం	07	రూ.1,88,000	రూ.35,000
మంచిర్యాల	12	రూ.4,23,000	రూ.70,000
నిర్మల్	04	రూ.1,41,000	రూ.25,000

కోలిండియా స్థాయిలో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఏరియా క్రీడాకారులు కోలిండియా స్థాయి పోటీల్లో రాణించాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఏరియాస్థాయి వార్షిక క్రీడలు ప్రారంభమయ్యాయి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటల వల్ల పోటీతత్వం పెరుగుతుందని, కొత్త స్నేహాలు చిగురిస్తాయని పేర్కొన్నారు. కంపెనీ క్రీడలకు, క్రీడాకారులకు కావాల్సిన సకల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఏరియా ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ నరసయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుకు ఎంపిక



సందీప్‌రెడ్డి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి సందీప్‌రెడ్డి వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి సమ్మక్క -రాజిరెడ్డిల కుమారుడు సందీప్‌రెడ్డి తన విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పూర్తి చేశాడు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు కళాశాలలో వెటర్నరీ సైన్స్ కోర్సు పూర్తి చేశాడు. అనంతరం వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ రాగా 2023లో పరీక్ష రాసి పోస్టుకు ఎంపికయ్యాడు.

షాపింగ్‌మాల్స్‌పై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని షాపింగ్‌మాల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్ స్థలం లేక వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. అధికారులు స్పందించి షాపింగ్ మాల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు గోపాల్, క్రాంతికుమార్, ప్రవీణ్‌కుమార్, నితీశ్ పాల్గొన్నారు.

అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని సరాండి టోల్‌ప్లాజా వద్ద డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించగా అనుమతులు లేకుండా కంటైనర్ వాహనంలో పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కంటైనర్‌లో 14 పశువులు ఉండగా వ్యాపారులు అబ్దుల్ అజీజ్, మీర్జా ముజాహిద్, షేక్ జాహిద్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించామన్నారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి ఉన్నారు.

బాలికను వేధించిన బాలుడి అరెస్ట్

మంచిర్యాలక్రైం: బాలికపై లైంగిక దాడికి పాల్పడి వేధిస్తున్న బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు స్థానిక సీఐ బన్సిలాల్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన తల్లి లేని మైనర్ బాలిక (17)ను మైనర్ బాలుడు గత కొంత కాలంగా వేధిస్తున్నాడు. బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలిక ఫిర్యాదు మేరకు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరుపర్చినట్లు సీఐ పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బుధవారం సిద్దిపేట పరిసర ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళ్తే బుధవారం ఉదయం 8 గంటలకు బస్సు హైదరాబాద్ బస్‌స్టేషన్ నుంచి ఆసిఫాబాద్‌కు బయలు దేరింది. 10 గంటల సమయంలో సిద్దిపేట ప్రాంతానికి చేరుకోగా అక్కడ రాంగ్‌రూట్‌లో వస్తున్న టూవీలర్‌ను తప్పించబోయి డ్రైవర్ అలీ డివైడర్‌పైకి ఎక్కించారు. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం తృటిలో తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను నిర్మల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన మహ్మద్ అబ్బాస్ అనే వ్యక్తి గత 15 సంవత్సరాల క్రితం నిర్మల్‌కు వచ్చి స్థానిక గాజుల్‌పేట్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇక్కడే స్థిరపడి 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇతనికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్నాడు. వచ్చిన డబ్బులు సరిపోక జలసాలకు అలవాటు పడి రాత్రి 1 గంట నుంచి ఉదయం 4 గంటల సమయంలో రెక్కీ నిర్వహించి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో జూలై 5న కిల్లా గుట్ట, జూలై 12న సోమవార్‌పేట్, జూలై 22న పింజారి గుట్ట, ఈనెల 4న కురన్నపేట్, 18న ఖిల్లాగుట్ట ఇలా వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. గతేడాది అక్టోబర్‌లో ఖానాపూర్‌లోని ఓ ఇంట్లో దొంగతనం చేశాడు. క్లూస్ టీం సభ్యులు దొంగతనం చేసిన చోట మహ్మద్ అబ్బాస్ వేలిముద్రలు దొరకడంతో నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందుకోసం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి హర్యాన, నాందేడ్ పోలీసుల సహకారంతో హర్యాన నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన వారందరిని విచారించారు. అబ్బాస్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని గుర్తించి అతడిని చాకచక్యంగా పట్టుకున్నారు. అతని వద్ద 150 గ్రాముల గంజాయి, 2 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి విక్రయించే వారిపై, దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టామన్నారు. ఇళ్లు, దుకాణ సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు రమేశ్, సాయికష్ణ, రవి, గోపి, కానిస్టేబుల్ తిరుపతి, గణేశ్, హోంగార్డు సతీశ్‌లను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై రమేశ్ తదితరులు ఉన్నారు.